# ఆడ బ్రతుకు

శ్రీమతి తూములూరి కృష్ణవేణి

"దుర్గా, దుర్గా" అని కేకలేశాడు ప్రసాద్. కాని, లోపలనుండి జవాబులేదు. రాత్రంతా డ్యూటీ చేసి అసలే విసుకుగానున్నాడు. అందులో పనివాళ్లంతా సమ్మె చేశారు. తనూ, వాళ్లతోపాటు సమ్మె చేయకపోతే యిబ్బంది. వెళ్లకుండా వుంటే జీతం రాదు. ఈ ఆలోచనలతో అతని బుర్ర తిరుగుతున్నది.

ఎప్పుడు నైట్ డ్యూటీకెళ్లినా ఉదయం 6 గంటలకే యింటికివచ్చి తలుపుతట్టగానే నిద్రకళ్లతో, కప్పుకున్న దుప్పటితో సహా వచ్చి, తలుపుతీసి మెంతో ఆప్యాయంగా పలుకరించేది భార్య. కాని ఈ రోజు ఎంత పెద్దగా పిలిచినా, తలుపు చప్పుడుగాని, లోపలనుండిగాని జవాబు, వస్తున్న అలికిడిగాని లేదు. తలుపును కాలితో తన్ని పెద్దగా కేకవేశాడు ప్రసాద్.

"ఒయ్.. వస్తున్నా, యేమిటా గోల" అంటూ గొళ్లెంతీసి దొడ్లోకి వెళ్లిపోయింది.

ప్రసాద్ గుడ్డలు మార్చుకొని కాళ్లు కడుక్కోటానికి దొడ్లోకి వెళ్లాడు. దొడ్లో బాదంచెట్టు క్రింద, పొడుగాటి వాలుజెడ ముందుకు పడుతూవుంటే, పమిటె నడుము చుట్టూ బిగించి, తోమిన అంట్లను కడుగుతున్నది దుర్గ.

"నీవు తోముతున్నావేం! పనిమనిషి రాలేదా?" అన్నాడు ప్రసాద్.

"పనివాళ్లంతా సమ్మె చేస్తారట. వాళ్లకు తప్పినా నాకు తప్పేదేముంది. పడిపున్నానుగా కూలిదానిలాగా చాకిరి చేయటానికి" అని విసుగ్గా అన్నది దుర్గ.

"యింట్లో కొంచెము పని యెక్కువయితే అంత విసుగు దేనికి. రాత్రంతా నిద్ర లేక పని చేసినవాణ్ణి నేనేమనుకోవాలి. పనివాళ్లంతా సమ్మె చేశారు. వాళ్లతో పాటు నేనూ చేసితీరాలి. వెళ్లితే, వాళ్లతో తంటా... వెళ్లకపోతే మన కడుపులో మంటా... యీ పరిస్థితిలో నాకెల్లాగుండాలి చెప్పు దుర్గా."

"మీకేం అలాగే అంటారు. పగలస్తమానం బండచాకిరీ చేస్తూ - పైగా మీరు వచ్చేసరికి స్నానానికి నీళ్లదగ్గరనుండి, భోజనానంతరం కిళ్లీదాకా రెడీగా వుంచాలి. ఇందులో నేలోపమయినా, చిక్కేగదా? యింట్లో భార్యను ఒక దాసీదాని క్రింద కట్టేస్తున్నారు మీ మగవాళ్లు."

"అసలే నామనసు చికాగ్గావుంది దుర్గా. నీ మాటలతో నన్ను వేధించక ఇన్ని కాఫీనీళ్లన్నా యివ్వు"

దుర్గ మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్లింది. ఆమె కాపరానికి వచ్చినప్పటినుండి భర్తతో నీవిధంగా విసుగ్గా నెన్నడూ మాట్లాడలేదు. ప్రక్కయింట్లోకి క్రొత్తగా అద్దెకువచ్చిన 'మహిళాసంఘం అధ్యక్షురాలి ఉద్బోధకాబోలు,' అనుకున్నాడు ప్రసాద్.

"ఏమండోయ్!. బజారుకెళ్లి పాలు తీసుకురావాలి. పాలవాళ్లుకూడా మూడు రోజులుసమ్మె చేస్తారుట. యివ్వాళ పాలవాడురాలా" అని వంటయింట్లోనుండే కేక లేసింది దుర్గ. "ఆహా! ఎక్కడచూచినా సమ్మెలే - నీవుకూడా సమ్మె చేయాలనుకోవడం లేదుకదా?" అన్నాడు ప్రసాద్, వంటింట్లోకివచ్చి కూర్చొని.

"పాకీవాళ్లదగ్గరనుండి పెద్ద ఆఫీసర్లదాకా సమ్మె చేస్తూయుంటే, ఆడవాళ్లుఅంత అసమర్థులనేనా, మీ అభిప్రాయం. మేమూ చేయదలచుకున్నాము."

"మీరు సమ్మెచేయడం దేనికి?" అన్నాడు. "దేనికా మీరు మమ్మల్ని మరీ మరీ హీనంగా చూస్తున్నారు. పెద్దచదువులు చదివి, వుద్యోగాలుచేసే స్త్రీలు స్వతంత్రంగా స్వేచ్ఛగా నుంటున్నారుకాని, మాబోటి గృహలక్ష్ములకు చదువు సంధ్యలనే సమస్య లేకుండా, కూపస్థ మండూకములవలె తయారుచేశారు. స్త్రీ అంటే బయటి ప్రపంచం నుండి, వంటయింట్లోకి విసిరిపారేసిన యంత్రమని మీ యుద్దేశ్యంకాబోలు" అన్నది దుర్గ తీవ్రంగానే.

"అయితే మిమ్మల్ని పురుషులు గౌరవించ లేదంటావా? ఎక్కడచూచినా మీ ఆడవాళ్ల ఫొటోలే! యే పత్రికలమీద చూచినా మీముఖ చిత్రాలే ఇంకావేమి కావాలి!" అన్నాడు ప్రసాద్.

"చాల్లెద్దురూ! ప్రతిసినిమా పత్రికలమీదా ఆడవాళ్ల అర్థనగ్న చిత్రాలన్నీ వేసి మా భారత స్త్రీల గౌరవం చెడగొట్టుతున్నారు.

అదికాక సినిమాయాక్టర్లకూ, పెద్ద చదువులు చదివి, యుద్యోగాలు చేసేస్త్రీల కున్నంతగౌరవం, మా మధ్యతరగతి సంసార స్త్రీలకు లేదు. గృహనిర్వాహణ బాధ్యత స్త్రీకి, ద్రవ్యార్జన పురుషుడికి. ఇది మనహిందూ సాంప్రదాయంలో పూర్వంనుండే వస్తున్న రివాజేగా. భార్య భర్తలు కుటుంబ నిర్వహణలో సమానులే. పూర్వపు ఆ యుద్దేశ్యాలుపోయి, "పోషించేవాడు పోషింపబడేది" అనేభావం మీలో పాతుకుపోయింది. కుటుంబ నిర్వాహణ, పిల్లలపోషణ, గృహకృత్యాలూ, ఇవి బండచాకిరిగాను, ఆఫీసుకెళ్లి దర్జాగా కుర్చీలమీద కూర్చొని చేసేవి వుద్యోగాలు కాబోలు! తనయిల్లూ, భర్తా, పిల్లలూ, సంసారం అంతాతన అనే వెర్రిప్రేమతో ఎన్నికష్టాలకయినా ఓర్చి ఆనందంగా గృహాన్ని చక్కదిద్దుకొనే గృహలక్ష్ములను చూస్తే, మీకింత నిరసనదేనికి? వనితాజనాన్ని

పీడించే పురుషుల దౌర్జన్యాలను నిర్మూలించాలి. అందుకే మా మహిళాసంఘం మంతా సమ్మెచేయ దలచుకొన్నాం."

"సెహబాష్ - దుర్గాదేవిగారూ!! మీ వుపన్యాసం అమోఘంగాయుంది. అయితే మాగతి అధోగతేనా? గృహలక్ష్ములంతా యేకమవుతారు కాబోలు." అన్నాడు ప్రసాద్.

'అబ్బ మీతో మాట్లాడ్డం నాదే తప్పు, చూస్తారుగా ముందు - ముందు మీకే తెలుస్తుంది" అని కూర తరుగుతూ కూర్చుంది దుర్గ కోపంగా.

ఆమెకు బాగా కోపమొచ్చిందని తెలుసుకున్నాడు ప్రసాద్. కోపం పోగొట్టా లన్న వుద్దేశ్యంతో.

"దుర్గా. ఈ రోజు ఆదివారంకదూ? మ్యాట్నీ సినిమా కెళదాం సిద్ధంగా వుండు? ఏం! ... ఇవాళ యేంకూర చేస్తున్నావ్. భలే కమ్మటి వాసన వేస్తున్నది తిరుగమాత."

దుర్గ మాట్లాడకుండానే కూర తిరుగమాతలో వేస్తున్నది - 'దుర్గను మాట్లా డించటం యెలాగా' అని ఆలోచిస్తున్నాడు ప్రసాద్.

"ఓహో! అప్పుడే సమ్మె ప్రారంభమయినట్లుందే? మాటలుకూడా ఆగి పోయినయ్?"

"ఏమిటండీమరీ, యేమాట మాట్లాడినా అలా హేళన చేస్తారు" నవ్వుతూఅంది.

"లేదు దుర్గా - అసలు విషయమేమిటో చెప్పు"

"ఏం చెప్పమంటారు? పురుషులకున్నంత స్వాతంత్ర్య స్వేచ్ఛలు స్త్రీల కెందు కుండకూడదు? స్త్రీ స్వాతంత్ర్యముకొరకు మా మహిళాసంఘములు కృషిచేయక తప్పదు."

"సరేలే, ముందు నా సంగతి కొంచెంచూడు - స్నానానికి వేడినీళ్లుతోడు. ఆకలేస్తున్నది. భోజనంచేసి, కాస్త నిద్రపోవాలి. రాత్రంతా నిద్రలేదు."

ప్రసాద్ భోజనంచేసి, గదిలోకివెళ్లి - పడక కుర్చీలో నడుంవాల్చాడు. దుర్గ కూడా భోజనంచేసి ముస్తాబయి,

"ఏమండోయ్, నేను ప్రక్కవాళ్లింటికెళుతున్నా; తలుపులన్నీ తీసేయున్నయ్ జాగ్రత్త" అంటూ వెళ్లిపోయింది.

పడక కుర్చీలో పడుకొని గుర్రుకొడుతున్నాడు ప్రసాద్.

ఆ సభ అప్పుడే ప్రారంభమయింది. యెందరో వనితలు ఒకరినొకరు త్రోసుకుంటూ, బిర - బిర లోనికి వెళుతున్నారు.

"స్వతంత్ర మహిళా సమ్మేళనము"

"స్త్రీ లోకాని కంతకూ సుస్వాగతము."

ఇత్యాది వాక్యాలతో తోరణాలు గాలిలో రెపరెపలాడుతున్నయ్ - మైదానమంతా లైట్లకాంతితో వెలుగుతున్నది. మధ్యనొక ఎత్తయిన వేదిక. నలుప్రక్కలా అరటి స్తంభాలు పూలకుండీలు. అవన్నీ అలాగ ఏర్పరచినవారి కళానైపుణ్యాన్ని మెచ్చుకుంటూ, ప్రసాద్ సభా ప్రవేశ ద్వారంవద్ద నిల్చొని యున్నాడు.

"శోభ తెచ్చేది, శృంగార మొలికించేది, పువ్వులూ - పూబోణులే!" అని పెద్దలూరికే అన్నారా? యెవరేమన్నా సరేగాని ఆడది లేనిచోట అందముండదు. అది నిజంగా ఒక ప్రమదావనమే. ఈ రకంగా ఆలోచిస్తూ నిలుచున్నాడు. ఇంతలో సభ ప్రారంభమయింది. "ఏంటయ్యా ఇది ఆడవాళ్లసభ అని తెలీదూ? వెళ్ళు వెళ్లు" అని లోపలికి వెళ్లుతున్న ఒక స్త్రీ ప్రసాద్‌ను కసురుకుంది. అట్టి అవమానమును సహించలేక గుట్టు చక్కగా ఇంటిదారి పట్టినట్లు, ప్రసాద్ కలగంటున్నాడు.

"ఏమిటండీ! అలా నోరు తెరుచుకుని పడుకొని గుర్రుకొడుతున్నారు?" అంటూ ప్రసాద్ చెయ్యిపట్టుకొని యూపుతూ లేపింది దుర్గ. ప్రసాద్ ఉలిక్కిపడిలేచి "ఆ! ఆ! నీవు మహిళా సంఘంలో నున్నావ్ కదూ? ఎప్పుడొచ్చావ్?" అని అన్నాడు ప్రసాద్.

"భలేవారేలెండి. మంచికలే కన్నారు!" ఆ రోజంతా పగటి సంగతులతోనే కాలంగడిపారు. ఇప్పుడు దుర్గ మహిళాసంఘ సభ్యురాలయింది. సమావేశములకని - ఉపన్యాసములకని, అప్పుడప్పుడూ వెళుతుండేది.

ఆ రోజు ఆదివారం ప్రసాద్ ఇంట్లోనే వున్నాడు, దుర్గయేదో వుపన్యాసాని కెళ్లి కొంచెం ఆలస్యంగా ఇంటికొచ్చింది.

"దుర్గా ఇంత ఆలస్యంగా వచ్చావేం, కాఫీ కాస్తుంటే చెయ్యి కాలింది" అన్నాడు ప్రసాద్.

"నీవు లేకపోయినా వంటచెయ్యగలనని యెప్పుడూ కోతలు కోసేవారే! మరి" నవ్వుతూ అంది దుర్గ.

"ఆ - యెంతయినా, గృహానికి వన్నె తెచ్చేది గృహలక్ష్మే కదూ?"

—(o)—